క్లుప్తంగా

అమ్మవారికి అవనిగడ్డ ఎమ్మెల్యే పూజలు



జగ్గయ్యపేట: రంగుల మహోత్సవంలో భాగంగా పట్టణంలోని రంగుల మండపంలో ఉన్న పెనుగంచిప్రోలు గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ గురువారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఆయనకు స్వాగతం పలికి పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల బాబ్జి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కృత్తివెన్ను: గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు కృత్తివెన్ను జెడ్పీటీసీ మైల రత్నకుమారి అన్నారు. గురువారం ఆమె లక్ష్మీపురంలో రూ.30 లక్షల జిల్లా పరిషత్ నిధులతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ గ్రామాభివృద్ధిలో భాగంగా నిధులు విడుదల చేయడంతో పాటు పనులు జరిగేందుకు అందిస్తున్న సహకారం మరువలేనిదని సర్పంచ్ పులగం సుబ్రమణ్యం అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పులగం రాము, ఆకన సాయి, పులగం నరసింహరావు, కేతినేని రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

ఎదురుమొండి(నాగాయలంక): అవనిగడ్డలోని కంప్యూటర్ సంస్థ సైబర్ జోన్ ఆధ్వర్యంలో దీవుల్లోని అసిస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహకారంతో ఎదురుమొండి దీవిలోని లక్ష్మీపురం, యేసుపురం, కృష్ణాపురం, ఎదురుమొండి గ్రామాల్లో ఉచిత వృత్తివిద్యా శిక్షణ గురువారం ప్రారంభించారు. అసిస్ట్ డెప్యూటీ డైరెక్టర్ ఎం.రామారావు మాట్లాడుతూ ఈ ఉచిత శిక్షణలో భాగంగా మూడు నెలలు పాటు కంప్యూటర్ పరి/జ్ఞానంపై సంపూర్ణ అవగాహన కలిగిస్తారని పేర్కొన్నారు. సైబర్‌జోన్ ప్రతినిధి బీసాబత్తుని కృష్ణలీల మాట్లాడుతూ 30 మందికి ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, ట్యాలీ తదితర కంప్యూటర్ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. సంస్థ ఏరియా కోఆర్డినేటర్ డి.వెంకట్రావు, దుర్గ, గ్రామ సమాఖ్య సభ్యులు, సైబర్ జోన్ యోగేష్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో పోతురాజు స్వామి వార్షిక జాతర

నాగాయలంక: గ్రామంలోని బోసుబొమ్మ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీపోతురాజుస్వామి వార్షిక జాతర మహోత్సవం ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి ఉప్పల లీలాకృష్ణప్రసాద్ (బుజ్జి) గురువారం తెలిపారు. 24వ తేదీ ఉదయం 8 గంటలకు కృష్ణానదిలో స్వామివారి ఘటం శుద్ధి పూజలు జరిపి జల్ది ఉంచుతారు. సాయంత్రం 5గంటలకు జల్దిలో నుంచి ఘటం తీసి రాత్రంతా గ్రామోత్సవం నిర్వహిస్తారు. 25న ఉదయం స్వామివారి ఘటము గుడికి చేరుకోవడంతో 9 గంటలకు సంప్రదాయక గుడి జాతర (సంబరం) గుంటూరు జిల్లా పల్నాటి ఆచార వంతులచే ఆరంభం అవుతుంది.

కొయ్య ఊయల బహూకరణ



మెరకనపల్లి (మోపిదేవి): కోదండ రామాలయానికి గ్రామస్తులు యర్రంశెట్టి శ్రీనివాసరావు గురువారం కొయ్య ఊయలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి యర్రంశెట్టి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం కొయ్య ఊయలను ఆలయానికి అందజేసినట్లు తెలిపారు.

హామీలు నెరవేర్చి ఓట్లు అడుగుతున్నాం

గడప గడపకు మన ప్రభుత్వంలో జెడ్పీ చైర్‌పర్సన్ హారిక



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అండగా ఉండాలని కోరుతున్న హారిక, రాము

బంటుమిల్లి: ఇచ్చిన హామీలు నెరవేర్చి ధైర్యంగా ఓట్లు అడుగుతున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తప్ప మరే రాష్ట్రంలో ఇలాంటి సీఎంలు లేరని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. మండల పరిధిలోని పెదతుమ్మిడి పంచాయతీలో గురువారం గడప, గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రమేష్ (రాము)తో కలసి ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరుగుతూ నవరత్నాల పథకాల లబ్ధిదారులకు బ్రోచర్లు, కరపత్రాలు అందచేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రామును ఎమ్మెల్యేగా, జగనన్నను ముఖ్యమంత్రిగా చేయాలని విజ్ఞప్తి చేశారు. రాముతో కలసి బ్రోచర్లు అందచేసిన ఆమె అన్న, అక్క, పెద్దమ్మ నీకు నవరత్నాల పథకాల ద్వారా జగనన్న ఇచ్చిన సొమ్ములు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చి బహిరంగ సభల్లో ధైర్యంగా నేను పనిచేశాను అనుకుంటేనే నాకు మరలా ఓటు వేయండి అని అడిగిన ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరంటూ హారిక రాములు లబ్ధిదారులకు అవగాహన కలిగించారు.

తాగునీరు, రోడ్లకు నిధులు మంజూరు చేశాం...

పెదతుమ్మిడి గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేశామని త్వరలో పనులు పూర్తి చేసి వేసవిలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తామని చైర్‌పర్సన్ ఉప్పాల హారిక రాము హామీ ఇచ్చారు. గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న వీరికి గ్రామస్తుల నుంచి ప్రధానంగా తాగునీరు, అంతర్గత రోడ్లు సమస్యలుగా దృష్టికి వచ్చాయి. వీటిపై స్పందించిన వీరిద్దరు తాగునీటి సమస్య పరిష్కారంతోపాటు అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు చేశామన్నారు. మరలా జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే ఈ పథకాల అమలుతోపాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సమన్వయకర్త రాము పేర్కొన్నారు. హారిక రాములు ప్రజల సమస్యలను ఓపికగా వింటూ పంచాయతీ శివారు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా గ్రామస్తులు హారిక రాములకు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో పూజలు చేసి ఆశీస్సులు పొందారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మల్లిశెట్టి వెంకటరమణ, వైస్ ఎంపిపి ఒడిమి చిన్నారిబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలడుగు బాబూరావు, ఎంపీటీసీ మద్దాల రుక్మిణి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, కంచడం సర్పంచ్, పిఏసిఎస్ చైర్మన్ బండారు చంద్రశేఖర్, గంధం శేషగిరి, అర్తమూరు ఎంపీటీసీ పి. వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మట్టా నాగబాబు, ఎం. సురేష్, కె. వెంకటేశ్వరరావు, ఎం. రాజబాబు, జి. రాజు, సిహెచ్. రాధకృష్ణ, కె. శ్రీనివాసరావు, కె. నాగేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, జి.వి.రాజు, పాము పుష్ప, అక్తర్‌హుస్సేన్, ఎం. వెంకటేశ్వరరావు, కె. మహంతిప్రసాదు, ఎం. నాగేశ్వరరావు, అంగన్‌వాడి కార్యకర్తలు, బుక్ కీపర్లు, గృహసారధులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 36వ డివిజన్ రాజుపేట ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. రాజుపేటలోని ఆంధ్రజాతీయ కళాశాల ప్రాంతంలోని కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు విన్నవించిన సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎగ్గోని గాంధీ, దార్ల చెన్నకేశవరావు, దమ్ము కేశవరావు, చింతపట్ల నాని, కొమ్ముకూరి ప్రభు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

మద్దిపట్లలో పంటల పరిశీలన



మద్దిపట్లలో పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

గూడూరు: జాతీయ ప్రణాళికా విభాగం అధికారులు గూడూరు మండలం మద్దిపట్లలో పర్యటించారు. విజయవాడ ఏరియా సీనియర్ స్టాటిక్‌స్టిక్ అధికారి మాధవి ఆధ్వర్యంలో పర్యటించిన అధికారుల బృందం గ్రామంలో సాగవుతున్న పంటలను పరిశీలించారు. కాలక్రమంలో సాగవుతున్న పంటల విస్తీర్ణం తగ్గిపోతుండటంతో దీనికి గల కారణాలను తెలుసుకోవడానికి కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇ క్రాప్ బుకింగ్‌కు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పంటలు ఉన్నాయో లేదో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు నరేంద్ర కుమార్ సింగ్, ఫైశాలీ, గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు విద్యార్థులకు ఇన్‌స్పైర్ అవార్డులు



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న డీఈఓ



రాహుల్, ఉపాధ్యాయులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

మచిలీపట్నంటౌన్: నగరంలోని పీఎం శ్రీ కేవీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థి బట్టా రాహుల్ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్‌ను ఆయన అభినందించారు. తమ విద్యాలయంలో చదువుతున్న రాహుల్‌కు ఈ అవార్డు రావటం అభినందనీయమని చెప్పారు. మొక్క పెరిగే నేల తేమను బట్టి దానికి నీరు సరఫరా అయ్యేలా రాహుల్ సైన్స్ ప్రాజెక్టు తయారు చేశాడన్నారు. నీరు వృథా కాకుండా పొదుపుగా వాడుకునే ఈ పరికరాన్ని తయారు చేసినందుకు రాహుల్‌కు అవార్డు వచ్చిందన్నారు. రాహుల్ కు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులు పి. హరికిషన్‌రావు, వి.హరికిషోర్‌కుమార్‌గుప్తాను ఆయన అభినందించారు.

కోడూరు విద్యార్థి ప్రతిభ

కోడూరు: జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ అవార్డు పోటీల్లో కోడూరు విద్యార్థి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. స్థానిక లక్ష్యా ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన కడవకొల్లు దీవెన అగ్ని నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టును రూపొందించింది. ఈ ప్రాజెక్టు అధికారుల మన్ననలు పొందింది. ఈ నెల 18న జరిగే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రదర్శించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విస్సంశెట్టి నాగరాజు తెలిపారు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థిని దీవెనకు డీఈఓ తాహెరా సుల్తానా ప్రశంసాపత్రాన్ని అందించారు. ప్రాజెక్టును రూపొందించేందుకు ప్రభుత్వం రూ.10 వేల నగదును మంజూరు చేసింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థి అరివేణి అభిరామ్ ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టరు కె. కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీన గోసాల లోని శ్రీ చైతన్య సూల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొన్న అభిరామ్‌ను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి తాహేరాసుల్తానా బహుమతి అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా విజేత అభిరామ్‌ను, గైడ్ టీచరు సీహెచ్ రేవతిలను డైరెక్టరు కె.కిషోర్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కష్టపడితే జీవితంలో ఉన్నత స్థానం

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పీవీ బ్రహ్మచారి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న విభాగాల్లో రసాయన శాస్త్ర విభాగానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ద్వారా విద్యార్థుల మధ్య స్నేహ భావం పెరుగుతుందన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. విద్యాభ్యాసం అనంతరం ఇదే స్నేహ భావాన్ని విద్యార్థులు కొనసాగించుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో ఉద్యోగావకాశాల్లో ఒకరినొకరు సహకరించుకోవాలని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధిస్తే ఉద్యోగాలు పొందడం సులభం అవుతుందన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వైకే సుందరకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు. రసాయన శాస్త్ర విభాగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన పరిశోధనశాలలు ఉన్నాయని వాటిని విద్యార్థులు వినియోగించుకోవాలని చెప్పారు. పరిశోధనలలో భాగస్వాములు కావాలన్నారు. ఇటీవల విజయవాడ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో పాల్గొని ఉద్యోగావకాశాలు పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి. రామశేఖర రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టించి పనిచేయడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానం పొందవచ్చన్నారు. త్వరలోనే విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో నూతనంగా జాయిన్ అయిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకులు పుష్ప లత, రవి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి వితరణ



అవనిగడ్డ: గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, విద్యాసంస్థల అధినేత యర్రబర్ల వీర శ్రీనివాసరావు వితరణ అందచేశారు. తాను చదువుకున్న అవనిగడ్డ హైస్కూల్‌కు రూ.20వేలు వ్యయంతో పోర్టబుల్ మైక్ సెట్, ఆట వస్తువులు అందించారు. సీఐ పీవీ త్రినాథ్ చేతుల మీదుగా హెచ్ఎం జీఎస్‌బీ గోపాల్‌కు అందచేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సనకా శ్రీకాంత్, అమ్ముల భాను ప్రకాష్, కోసూరు పూర్ణచంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి సంబరాలు



కుమారకంలో భక్తుల ఊరేగింపు

పెడన:పట్టణంలోని పద్మశాలీ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక 2వ వార్డులో వేంచేసి ఉన్న భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవ సంబరాలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. రెండు రోజులు పాటు నిర్వహించే ఈ సంబరాల్లో భాగంగా మొదటి రోజు వేకువ జామున గణపతి పూజతో ప్రారంభించి ప్రత్యేక పూజలు పుణ్యాహం, పంచగవ్యం, రక్షా బంధనపూజ, అఖండ స్థాపన, ప్రధాన కలశస్థాపన, స్నపన హోమాలు, ఆన కట్టుట నిర్వహించారు. మధ్యాహ్నం కుమారకం (మేళతాళాలతో ఊరేగింపుగా నృత్యాలు చేసుకుంటూ వెళ్లి బొట్టు పెట్టి స్వామి వారి కల్యాణానికి రావాలని పిలుపులు), సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటల తరువాత స్వామివార్లను అత్యంత వైభవంగా ఊరేగించారు. శుక్రవారం ఉదయం 8.02 గంటలకు కల్యాణం ఘట్టాన్ని ప్రారంభించనున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. కల్యాణం అనంతరం 11.30 గంటలకు భారీ అన్న సమారాధన ఉంటుందని, భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించాల్సిందిగా పద్మశాలీయ బహూత్తమ సంఘం నాయకులు కోరారు.

ఎమ్మెల్యే కృషితో సీసీ రోడ్డు నిర్మాణం



లక్ష్మీపురం(చల్లపల్లి): అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కృషితో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి తెలిపారు. ఒకటో వార్డు సాయిబాబా ఆలయం సమీపంలోని రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులను గురువారం భూమి పూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.4,80,000 తో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మోదుమూడి కుటుంబరావు, శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరా

సహాయ సేవలు అభినందనీయం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: సహాయ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్‌బాబు అన్నారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1300 సేవా కార్యక్రమాలు పూర్తయిన సందర్భంగా నగరంలోని గుప్తా సెంటరులో ఉన్న సహాయ సేవా క్యాంటీన్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. సుధాకర్‌బాబు మాట్లాడుతూ సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా క్యాంటీన్ ఏర్పాటు చేసి పేద రోగులు వారి బంధువులకు రూ. 15 కే భోజనం అందిస్తుండటం అభినందనీయమని చెప్పారు. పేదలను ఆదుకోవటం ఆదర్శనీయమన్నారు. సేవలు మరింత విస్తృతం చేయాలని కోరారు. ఎల్ఐసీ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ వివి ఫణిరామ్‌కుమార్ మాట్లాడుతూ పేదల కోసం ప్రతిరోజు కృషి చేస్తున్న సహాయ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. రాబోయే ఎస్‌బీఐ మచిలీపట్నంశాఖ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా సహాయ ఫౌండేషన్‌కు సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌భాషా, రోటరీక్లబ్ కార్యదర్శి అనుపమ, కాల్ ఫర్‌బ్లడ్ నిర్వాహకుడు వెంకన్నబాబు, న్యాయవాది ఎల్ బాలాజీ, మైనార్టీ నాయకుడు బాషు, మహిళా విభాగం నాయకులు నూర్జహాన్, వెంకటేశ్వరమ్మ, లక్ష్మీకాంతం, సుధారాణి, మీడియా విభాగం ప్రతినిధి కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సింధు స్నానాలపై రేపు సమీక్ష

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో జరిగే సింధు స్నానాలపై శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బందరు ఆర్డీఓ వాణి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. వేణుగోపాలుడి కల్యాణోత్సవాలు, సింధు స్నానాలకు వచ్చే భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించనున్నట్లు చెప్పారు.


కార్యదర్శుల నియామకంపై హర్షం

చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులను పంచాయతీకి కార్యదర్శులుగా నియమించటం పట్ల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.గోపీచంద్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన జీవో విడుదల చేయటం ఆనందదాయకంగా ఉందన్నారు. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

కోనేరుసెంటర్: పదవ తరగతి విద్యార్థిని అదృశ్యంపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం మాచవరానికి చెందిన ఓ బాలిక పదవ తరగతి చదువుతుంది. ఆ బాలికకు ఇన్‌స్టాగామ్ లో ఓ యువకుడు పరిచయమయ్యాడు. ఈ నెల 14వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థిని ఇంటికి తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. స్నేహితులు ఇచ్చిన సమాచారం మేరకు ఇన్‌స్టాలో పరిచయమైన యువకుడు బాలికను తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు తమ కుమార్తె కిడ్నాప్‌నకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు సచివాలయాలు, ఆర్‌బీకేలు ప్రారంభం



కోడూరు: మండలంలో కోడూరు–1, మందపాకల సచివాలయాల పరిధిలో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకే భవనాలను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు భవనాల ప్రారంభం ఉంటుందని, అన్ని శాఖలాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ముగ్గురు కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి. వాసు సమాచారం మేరకు మచిలీపట్నంకు చెందిన పరసా వెంకటేష్, మహ్మద్ నూరుబాషా, కాట్రగడ్డ జగదీష్‌సాయి పాఠశాల ఆవరణలో సంచరిస్తుండగా వీరిని కొత్త వ్యక్తులుగా అనుమానించిన గ్రామస్తులు పోలీసులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఎస్ఐ సిబ్బందితో ఆకస్మిక దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. చెడునడత కల్గినవారిగా అనుమానించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అర్తమూరు ఎందుకు వచ్చింది ఏ ఆలోచనలో వారు ఉన్నది విచారణలో తేలుతుందని ఎస్ఐ వాసు పేర్కొన్నారు.